# దేశభక్తి

మూలం: హోవార్డ్ ఫాస్ట్

తెలుగు: ఎమ్. పార్థసారథి

ఫాక్టరీకి ఎనిమిదిళ్లావల వుంటాడు మార్టిన్ ఆండర్సన్. అందువల్ల రోజూ సాయంత్రం పనినుండి యింటికి నడిచే వస్తాడు. ఎప్పుడైనా వర్షమో, మంచో కురుస్తుంటే మాత్రం తోటి పనివాళ్ల బండి మీదో, లేదా అందరూ కలిసి వచ్చే కార్లోనో ఆ సద్దుకుంటాడు. అతనంటే వాళ్ళకిష్టం. అతడి కోసం కార్లో మరికాస్త ఒదిగి కూర్చోవటానికి వాళ్లేమీ యిబ్బంది పడరు. రవాణా ఖర్చులు తగ్గించుకోవటంవల్ల భార్యకూ, పిల్లలకూ మరిన్ని సౌకర్యాలు కల్పించే వీలైందతనికి.

అంతేగాక రోజంతా ఫాక్టరీలో కాలు కదల్చకుండా నిలబడి పెట్రోలు వాసనా, కరుగుతున్న లోహం వాసనా, చెమట వాసనా పీల్చిన శరీరం సరదాగా నడుస్తూ, స్వచ్ఛమైన గాలిని పీల్చుకోవటంవల్ల ఆరోగ్యం కూడా బాగుపడుతుంది. ఎనిమిది బ్లాకులంటే నడకకు సరైన దూరం. ఆలోచించటానికీ, ఊహించటానికి తీరిక. ఫాక్టరీలో దొరకని తీరిక. భార్యకు ఏమేమి కబుర్లు చెప్పాలో ఎంపిక చేసుకోవటానికి తీరిక.

ఒకసారి యిల్లు చేరితే మళ్లీ బైటికి రాడు ఆండర్సన్. కొన్నాళ్ళక్రితం తాగుడు మానేశాడు. భార్యతో ఎటైనా పోవాలన్నా బేబీ సిట్టర్స్ ఖరీదు మరీ ఎక్కువైపోవటంతో థియేటర్‌కి నెలకి ఒకటి రెండుసార్లో తప్ప అదీ వీలుపడదు. అతడి సరదా అంతా పిల్లలతో గడపటం. టివి చూడటం. వయసు గడిచిపోతోందని తెలుసు. కాని అందులో విచారంగానీ, పశ్చాత్తాపంగానీ లేదు.

ఇబ్బందుల్లేవనికాదు. కాని ఆ యిక్కట్లు భార్యాపిల్లలవి కావు. ఇంటికెళ్లి పిల్లలతో ఆడుకోవాలా, భార్యకు యింటిపనిలో సహాయపడాలా అని ఆలోచిస్తూ నడుస్తున్న అతను కాస్త ఆలస్యంగా, తనపక్కనే నడుస్తున్న యిద్దరు వ్యక్తుల్ని గమనించాడు. ఎందుకోగాని, వాళ్లను చూడగానే భయం వేసింది. అడుగులో అడుగు వేస్తూ నడుస్తున్నారు. ఆ భయం శారీరకంగాదు. ఆండర్సన్ బలిష్ఠకాయుడు. ఆ యిద్దరూ తనకన్నా సైజులో చిన్నవాళ్లు. వయస్సు కూడా 25-26కు మించదు. ఖరీదైన దుస్తులు, హాట్లూ పెట్టుకున్నారు. ఆండర్సన్‌కు, ఆ ఎనిమిదిళ్ళ దూరమూ చాలా ఎక్కువనిపించింది. ఆ యిద్దర్లో ఒకడు.

'హల్లో, మార్టీ' అంటూ పలకరించాడు.


'సాయంత్రం హాయిగా వుందిగదూ!' అన్నాడు మరొకడు.

'ఏం కావాలి?" అన్నాడు ఆండర్సన్.

"మీ పేరు మార్టిన్ ఆండర్సన్ కదూ!"

"ఐతే?"

"అలా కోప్పడకండి సార్. ఇవన్నీ రొటీన్ విషయాలు. మేం ఎఫ్. బి. ఐ. వాళ్ళం. ఇదిగో కార్డు చూడండి."



ఆండర్సన్ కార్డులు చూశాడు. వాళ్లిద్దరూ అలా నడిచినప్పుడే అతడికీ అవమానం కలిగింది. పోలీసులు తప్ప ఎవరూ అలా అడుగులో అడుగు వేస్తూ నడవరు.

పక్కన బిల్డింగ్ చూసి, 'ఇంకా ఎనిమిదిళ్లున్నాయి ' అనుకున్నాడు.

"మీరు రోజూ యింటికి నడిచివెళతారని తెలుసు. ఓ రోజు మీతోపాటు నడుద్దామని యిలా వచ్చాం."

"అంతే. అంతే. ఇంకేమీలేదు. ఏదోకాస్త కబుర్లు చెప్పుకోవచ్చని."

"మార్టీ, మీ దేశభక్తి గొప్పది. ఆ విషయం మాకందరికీ తెలుసు యుద్ధంలో మీరు చేసిన సాహసకృత్యాల రికార్డు మా వద్ద వుంది. అసలు మీ గురించి మాకెంత తెలుసో చెబితే ఆశ్చర్యపోతారు. తెలుసుకోవటం మా వృత్తి. అందువల్లే మాకు బాగా తెలుసు, మీరు మంచి అమెరికన్ పౌరులని."

"మీ గురించి ఎక్కడైనా, ఏదైనా విన్నప్పటికీ అదివళ్లీ మిమ్మల్నడిగి రూఢి పరచుకోవటం మంచిది గదా. ఎందుకంటే, విషయాలన్నీ ఓ పద్ధతిలో పేర్చిచూస్తే తప్ప అర్థం కావు మాకు జాన్సన్, లెవీ. కర్టిస్‌ల గురించి కూడా తెలుసు. వాళ్లు మీ స్నేహితులుగదూ. వాళ్లు గులాబీ కన్నా ఎరుపని* తెలుసు. ఊఁ. గులాబీ కన్నా ఎరుపు. అందువల్లే వాళ్ళతో మీకు ఎటువంటి పరిచయ ముందో తెలుసుకోవాలని వచ్చాం. మీరు కూడా గులాబీ కన్నా ఎరుపని అనుకోవటం లేదు. మీరు మంచి అమెరికన్ పౌరులనే మా అభిప్రాయం"

"అందువల్లే ఈ విచారణలో మాతో సహకరిస్తారని ఆశిస్తున్నాం. మాకు చాలా తెలుసు. కాని పూర్తిగా తెలియదు. ఫాక్టరీలోని ఎరుపు మనుషులు ఆ ముగ్గురేకారు. యూనియన్లో యింకా చాలా మంది వున్నారు. బహుశా వాళ్ళ గురించి మీకు బాగా తెలిసి వుంటుంది. ఈ దేశాన్ని ప్రేమించే మీరు, చట్టరీత్యాఎన్నుకోబడిన ప్రభుత్వాన్ని కూలదోసే ప్రయత్నం చేస్తున్న ముఠాలను ఏరివేయడానికి మాతో సహకరిస్తారుగదూ!"

---

*కమ్యూనిస్టులు—(అను)

"మార్టీ, మాతో ఎవరెవరు సహకరిస్తారనుకున్నారు? ఇంచుమించు అందరూ. చాలా మంచి పౌరులు. మాతో సహకరించేవాళ్లు భయపడవలసిన అవసరమే లేదు. వాళ్ల పూర్తి భద్రతకు మాదే పూచీ. దేశభక్తిగల అమెరికన్ పౌరులందరూ మావద్దకు వస్తారు. మేం వాళ్ళను చేరదీస్తాం. ఆహ్వానిస్తాం."

"నిజానికి అలాంటివాళ్లు భయపడాల్సిన అవసరంలేదు. ఎఫ్. బి. ఐ. అంటే కొందరు సందేహిస్తారు. వాళ్లేవేవో కథలు వినివుంటారు. కాని అదంతా వట్టి నాన్సెన్స్. అసలు సంగతేమిటంటే ఎఫ్. బి ఐ. మీ సంస్థ. మీ కోసం, మీ సేవకోసం ఏర్పాటైన సంస్థ."

తమాషా రంగుల్తో ఆకాశంలో చీకటి ముసురుకుంటోంది.

"అదీ సంగతి. అందరు మంచి అమెరికన్ పౌరుల్లాగే మీరుకూడా మాతో సహకరించాలని...."

"గో టు హెల్." అన్నాడు ఆండర్సన్.

"అలా మాట్లాడితే అర్థంలేదు. మనం ఎంతో సన్నిహితంగా మాట్లాడుకుంటున్నాం. కనీసం మాలాగే మర్యాదగా మాట్లాడొచ్చుగా."

"గో టు హెల్."

"మీరు తొందర పడుతున్నారు మార్టీ, వాళ్లు మీకిలాంటి తర్ఫీదు యివ్వటం మంచిదే గాని మేమడిగితేనేమో 'గో టు హెల్' అంటారా? కేవలం అలా అన్నందుకే మేం మిమ్మల్ని 'కమ్యూనిస్ట్'గా ఆరోపించొచ్చు తెలుసా! కాని అప్పుడే మీ మీద అలాంటి ఆరోపణలు చెయ్యటం మా వుద్దేశం కాదు. మీరు 'కమ్యూనిస్టు' కాదని నమ్మటానికి మేం రెడీగా వున్నాం. ముందే చెప్పాంగా, మాకు అన్ని విషయాలూ తెలియవని. మీరు ఔనో, కాదో కాస్త ఆలోచించుకుని మరీ చెప్పండి. ఇదంతా తొందరపడి తీసుకోవలసిన నిర్ణయం కాదు."





ఇవతలవ్వి పెద్ద దెయ్యం -
అవతలవ్వి చిన్న దెయ్యం!!!



దెయ్యాలను చూపిస్తా
నయ్యారమ్మనుచు నొక్క ఆసామీ నా
కయ్యా తన కూతుళ్ళను
దెయ్యాలపుచు పిలిచి చూపె సిరిసిరి మువ్వా!

— శ్రీశ్రీ

---

"పోనీ యిలా చూడండి. మేం ఎంతో మర్యాదగా మిమ్మల్ని మాతో సహకరించమని అర్థించాం. ఒక మంచి అమెరికన్ పౌరుడు పరో సాటి పౌరుణ్ణి అలా "గో టు హెల్"! అనగలడా? మీ కమ్యూనిస్ట్ దోస్తులు మీకు 'ఇన్‌ఫార్మర్' వగైరాల గురించి ఏదో నూరిపోసి వుంటారు. నిజాయితీగల అమెరికన్ పౌరులుగా ప్రభుత్వంతో సహకరించే వ్యక్తులందర్నీ ఇన్ఫార్మర్లనీ, స్టూల్‌పిజిన్లనీ అనటం తప్ప ఆ వెధవలకు మరేం చాతనవును! లేక, మీరు మంచి అమెరికన్ పౌరులనుకోవటంలో మేం పొరపాటు చేశామా? మేం పొరపాటు చేశామని చెప్పటంలేదు. చేసి వుంటా మేమోనని అంటున్నాం."

"తప్పేమో?"

"తప్పే."

"మీ గురించి నిజంగానే తప్పు అంచనా వేసుకుని వుండొచ్చు. మా అంచనాకు ఆధారమే లేకపోవచ్చు."

"మా అంచనా తప్పు అనుకోవాలంటే మీ మీద కొన్ని బాధ్యతలు వచ్చి పడుతున్నాయి మార్టీ. మీరు పనిచేసే ఫాక్టరీలో కేవలం ట్రాక్టర్లు మాత్రమే తయారు కావు. కొన్ని టాంకుల భాగాలు కూడా అక్కడ తయారవుతాయి. ఈ ఎర్రసేన్ని నలిపివేసే టాంకులు. మరి మా అంచనా తప్పైతే మీకుద్యోగాలిచ్చిన వాళ్లు కూడా మళ్లీ ఆలోచించుకోవాల్సి వుంటుంది. ఎందుకంటే వాళ్లూ మిమ్మల్ని మంచి అమెరికన్ పౌరులనే అనుకున్నారు."

"ఉదాహరణకు, ఆ ఫాక్టరీ మేనేజర్ని తీసుకోండి. అతడికి మనదేశ వ్యవహారాలంటే ఎంతో శ్రద్ధ తన ఫాక్టరీలోని ఓ వుద్యోగి ప్రభుత్వంతో సహకరించటం లేదని అతడికి తెలిసిందనుకోండి. అతడు చాలా బాధపడవచ్చు."

"బాధపడటమేనా, వెంటనే వుద్యోగంలోంచి పీకెయ్యవచ్చు."

"మార్టీ, యిలాంటి వాళ్ళకు యింకెక్కడైనా వుద్యోగం దొరుకుతుందనుకుంటున్నావా? ఈ వూళ్లో ప్రభుత్వంతో ఏదో ఓ సంబంధంలేని ఫాక్టరీయే లేదు. హీరో కావటం బాగానే వుంటుంది. కానీ మీ పిల్లలు ఆకలితో ఏడిస్తే ఏమిస్తావు?"

"ఛ. ఛ. మార్టీ అలాంటి వాడు కాదు."

"నేనూ అలా అనుకోవటం లేదు. మార్టీ అంటే నాకెంతో యిష్టం. మార్టీ నూటికినూరుపాళ్లు మంచి అమెరికన్ పౌరుడనే నా నమ్మకం. మార్టీ, అదీ సంగతి అందుకే మాతో సహకరించమని అడుగుతున్నాం. అర్థమైందా?"

'గోటు హెల్, వెళ్లండి. వెళ్లిపోండి." అంటూ అరిచాడు అండర్సన్.

ఆ యిద్దరు పోలీసుల మొహాలూ మారిపోయాయి. వారి మర్యాద బురఖా చిరిగిపోయింది. మూతులు బిగించి, తీవ్రంగా చూస్తూ.

"ఓకే మార్టీ"

"నువ్వు కోరుకున్నట్టే కానీ మార్టీ" అంటూ వెళ్లిపోయారు. ఒకే ఎత్తు. ఒకే సైజు. ఒకే నడక తీరు. కవలపిల్లల్లా వున్నారిద్దరూ.

ఆండర్సన్ యిల్లు చేరుకున్నాడు. ఆ ఇంటి కప్పుటికి తొమ్మిదివేల డాలర్లు కట్టాడు. నెలకు తొమ్మిది వందల డాలర్లు-ఇల్లు తన స్వంతమయ్యేదాకా, పిల్లలు పెరిగి పెద్దవాళ్ళయ్యేదాకా, వృద్ధాప్యంలో తనూ భార్యా సుఖంగా గడప గలిగిందాకా-స్వేచ్ఛా ప్రియులు వలస వచ్చిన అమెరికా తనకిచ్చిన కానుక. ఇదీ తన యిల్లు. తను రోజూ సాయంత్రం నడిచి చేరుకునే యిల్లు అతనికి యింటికి నడవటం చాలా యిష్టం. ✳

